క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడి దుర్మరణం


బయ్య తిరుపతి (ఫైల్)

ఆత్మకూరు : రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ నాయకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మండలంలోని నీరుకుళ్ల శివారులో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మత్స్యశాఖ మాజీ చైర్మన్, ముదిరాజ్ సంఘం నాయకుడు బయ్య తిరుపతి(40) నీరుకుళ్లలో ఓ కార్యక్రమానికి బైక్‌పై వెళ్లి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో నీరుకుళ్ల శివారులో ఎదురుగా వస్తున్న కారు అతడి బైక్‌ను అతివేగంగా ఢీకొట్టింది. దీంతో తిరుపతి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తిరుపతి మండలంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక నాయకుడిగా పనిచేస్తున్నాడు. అతడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కాగా అతడి మృతి పార్టీకి తీరనిలోటని 'కుడా'చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి విచారణ వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్‌లు తెలిపారు.

చెట్టును ఢీకొన్న బైక్

యువకుడి మృతి


మృతిచెందిన మధుకర్

కమలాపూర్ : బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఈ సంఘటన మండలంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం బావుపేటకు చెందిన సబ్బు మధుకర్ (26) ద్విచక్ర వాహనంపై కమలాపూర్ మండలంలోని కానిపర్తి నుంచి బావుపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో కానిపర్తి–శంభునిపల్లి గ్రామాల మధ్యలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మధుకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

పరకాల : పరకాల–హనుమకొండ రహదారిలో గల కామారెడ్డిపల్లి శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం వరంగల్ నుంచి వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్‌తో బయలుదేరిన వాహనాన్ని ఎదురుగా వస్తున్న (టీఎస్ 25 టీ3669) నంబర్ గల టిప్పర్ కారును ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపుతప్పి కూల్ డ్రింక్స్ వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్స్ పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్ బాధవత్ నవీన్‌కు కాళ్లు, చేతులు విరిగాయి. స్థానికులు అందించిన సమాచారంతో 108 సర్వీస్ సిబ్బంది క్షతగాత్రుడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. కూల్ డ్రింక్స్ వాహన యాజమాని అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పరకాల ఎస్సై శివకృష్ణ తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన దూలం రమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు రఘుపతిరెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. నాయకులు ఆదిరెడ్డి, రాజయ్య, సుధాకర్‌రెడ్డి, శ్రీను, అశోక్, రాజు, సంతోశ్, కుమారస్వామి, రాజు, సందీప్‌రెడ్డి, సురేశ్, రాజిరెడ్డి, కుమారస్వామి, రవి ఉన్నారు.

పరామర్శ

దామెర : మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు తాత కొమురయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. పార్టీ మండల అధ్యక్షుడు రాము, నాయకులు కృష్ణమూర్తి, శంకర్, లింగమూర్తి, కొమురయ్య, ప్రసాద్ ఉన్నారు.

శాయంపేట : మండలంలోని తహరాపూర్ గ్రామానికి చెందిన ముక్కెర సారయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పరకాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రేణికుంట్ల సదయ్య ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నివాళి

నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తల్లి అయిన గోగుల జయశ్రీ ఆదివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎల్కతుర్తి : మండల కేంద్రంలో ఎల్కతుర్తి ఎక్స్‌ప్రెస్ ఇండస్ట్రియల్ ఏరియా గ్రానైట్ ఫీడర్ ప్రాంతం, స్థానిక జంక్షన్ 'కుడా' అభివృద్ధి పనుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఖాళీ సీసాలతో పంటకు రక్షణ


మండల కేంద్రంలో సాగు చేసిన మొక్కజొన్న పంట


గాలికి శబ్దం చేస్తున్న ఖాళీ సీసా

- రైతుల వినూత్న ఆలోచన
- పక్షులు, అడవి జంతువుల నుంచి పంట రక్షణ

ఎల్కతుర్తి : రైతులకు తట్టిన వినూత్న ఆలోచన మొక్కజొన్న పంటకు రక్షణగా నిలుస్తోంది. ఉదయం నుంచి చీకటి పడే వరకు పంటలపై పక్షులు వాలకుండా గొంతు చించుకొని చేన్ల చుట్టూ తిరుగుతుంటారు. రాత్రి పూట అడవి పందులు పంటలను ధ్వంసం చేయకుండా కాపలా కాసేవారు. పంట చేలలో మంచెలు ఏర్పాటు చేసి శబ్దాలు చేసేవారు. ఇలా పంట చేతికి వచ్చే వరకు శ్రమించేవారు. పగటి పూట పక్షులు, రాత్రి వేళ అడవి జంతువుల నుంచి మొక్కజొన్న పంటకు భారీ నష్టం కలుగుతుందని, పంటను కాపాడుకునేందుకు రైతులు వినూతన్నంగా ఆలోచించారు. బీరు సీసాల వినూత్న ప్రయోగంతో ప్రస్తుతం రైతులకు గొంతు నొప్పి లేకుండా కంటినిండా నిద్రిస్తున్నారు. ఖాళీ బీరుసీసాకు మూరెడు తాడు కట్టి మధ్యలో సీసాకు తాకేలా ఇనుప బోల్టు కట్టి చివరన గాలికి ఊగే విధంగా అట్టముక్క కట్టి ఎత్తైన ప్రదేశంలో చెట్టు కొమ్మలకు కడుతున్నారు. దీంతో 24 గంటల పాటు గాలికి అట్టముక్క కదిలి బోల్టు ఆ ఖాళీ బీరు సీసాకు తగలడంతో వచ్చే శబ్దానికి మనుషుల అలికిడిగా భావించి పక్షులు పంటలపై వాలకుండా పోతున్నాయి. రాత్రి వేల అడవి జంతువులు సైతం చేన్లలోకి ప్రవేశించడం లేదని రైతులు తెలిపారు. ఖర్చులేని ప్రయోగం కావడంతో ఒకరిని చూసి మరొకరు పంట చేన్ల వద్ద వీటిని వేలాడదీస్తున్నారు. ఇలా మండల వ్యాప్తంగా రైతులంతా ఇదే విధానాన్ని అనుసరిస్తూ మొక్కజొన్న పంటను రక్షించుకుంటున్నారు. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలకు గాను మరో రెండు అనుబంధ గ్రామాలు ఉన్నాయి. వీటికి మొత్తంగా 24వేల ఎకరాలు భూ విస్తీర్ణం ఉంది. ఇందులో 2000 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంట సాగుచేయగా, 15,100ఎకరాల్లో వరి, మిగితాది ఇతర పంటలు సాగుచేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. రైతులకు తట్టిన ఈ ఆలోచన విధానంతో రేయింబవళ్లు తమ పంటను పక్షులు, అడవి జంతువుల నుంచి ఇలా కాపాడుకుంటున్నామని తెలుపుతున్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి

- బీఆర్‌ఎస్ నాయకుడు నాగుర్ల వెంకన్న


మాట్లాడుతున్న నాగుర్ల వెంకన్న

ఎల్కతుర్తి : ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని అన్ని రంగాల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నాగుర్ల వెంకన్న సూచించారు. ఆదివారం ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఆవిష్కరణకు ఆయన ముఖ్యతిథిగా హాజరై విగ్రహ ఆవిష్కణ చేశారు. అనంతరం ఆరే సంక్షేమ సంఘం గ్రామ అధ్యక్షుడు మోరే బాబురావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగుర్ల మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీత వేస్తున్న సందర్భంగా ఆరేకుల సంఘం నాయకులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి అన్ని రంగాల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో ఆరెకుల సంక్షేమ సంఘానికి కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని కాపాడుకునేందుకు చుట్టూ ప్రహరీ నిర్మాణారికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఆరేకుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించే విధంగా ప్రభుత్వానికి విన్నవించాలని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నాయకులు ఢిల్లీకి వెళ్లి ఓబీసీ సమస్యను వెంటనే పరిష్కరించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపెల్లి శివాజీ, నాయకులు రాకేశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, లింగారావు, సోమిడి అంజన్‌రావు, మనోహర్‌రావు, సుకినె సంతాజీ, దామోదర్, మల్లయ్య, రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దేవాదుల మోటారు బంద్ చేయాలి

- రైతుల నిరసన


దేవాదుల పంప్‌హౌస్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల దేవాదుల పంపుహౌజ్ ఎదుట ధర్మసాగర్‌కు వెళ్లే మోటారు బంద్ చేయాలని ఆదివారం మైలారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి గ్రామాల రైతులు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రైతు బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. జోగంపల్లి దేవాదుల పంపుహౌజ్ నుంచి ధర్మసాగర్‌కు పంపింగ్ చేసే మోటార్‌ను వెంటనే బంద్ చేయాలని, గతంలో రెండు మోటార్లు నడువగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదేశాల మేరకు ఒక మోటారు బంద్ చేసినట్లు తెలిపారు. ఆ ఒక్క మోటారు కూడా కొన్ని రోజులు బంద్ చేయాలని కోరారు. మైలారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి గ్రామాల రైతుల పంటలకు సాగునీరు అందడం లేదని, తమ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఇప్పటికీ చలివాగు ప్రాజెక్ట్ కాల్వ మరమ్మతు కోసం క్రాప్ హాలీడే ప్రకటించామని తెలిపారు. అధికారులు చొరవ చూపి కొన్ని రోజులు ధర్మసాగర్ సాగునీరు పంపింగ్ చేసే మోటారును బంద్ చేసి ఈ ప్రాంత రైతులను ఆదుకోవాలని కోరారు. మైలారం, పత్తిపాక, హుస్సేన్‌పల్లి రైతులు పాల్గొన్నారు.

28 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, వాహనంతో పోలీసులు

కమలాపూర్ : మండలంలోని అంబాలలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై వీరభద్రరావు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అంబాలకు చెందిన బోయిని రాజు అనే వ్యక్తి రేషన్ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఓ వాహనంలో లోడ్ చేస్తున్నాడనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో బోయిని రాజుకు చెందిన (టీఎస్ 02 యూబీ 9210) నంబరు గల ట్రాలీ వాహనంలో లోడ్ చేసి ఉంచిన రూ.1,09,200 విలువచేసే 28 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకుని, బియ్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న బోయిని రాజుపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అక్రమ దందా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ వీరస్వామి, కానిస్టేబుళ్లు సర్వర్‌పాషా, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి


ఐనవోలు : పట్నాలు, ఒగ్గు పూజలకు సిద్ధమైన భక్తులు


శాయంపేట : హోమంలో పాల్గొన్న నారాయణరెడ్డి దంపతులు

ఐనవోలు : వారాంతపు జాతరలో భాగంగా మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తులు సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆలయంలో పూజలు ఆరంభం కాగా నిత్య కైంకర్యాలు శైవాగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి(రథ సేవ) మొక్కులు చెల్లించారు. కొందరు ఒడి బియ్యం, శారె సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు తాకిడితో ఐనవోలు ప్రాంతం కిక్కిరిసింది.

ఘనంగా బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామంలో సోమవారం జరుగనున్న గ్రామ దేవత బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా ఆదివారం గ్రామ దేవత బొడ్రాయి విగ్రహాలకు పంచామృత అభిషేకాలు నిర్వహించారు. యజ్ఞశాలలో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని యజ్ఞం, హోమాలు నిర్వహించారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కొప్పుల గ్రామ పెద్దలు వంగాల నారాయణరెడ్డి, గ్రామస్తులు సామల మధుసూదన్, బగ్గి రమేశ్, మేకల శ్రీనివాస్, కుమారస్వామి పాల్గొన్నారు.

'ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలి'

వర్ధన్నపేట : ఎస్సీలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి కంజర్ల సమ్మయ్య అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా కుమారస్వామి హాజరై మాట్లాడారు. గడచిన 3 దశాబ్దాలుగా పాలకులు ఎస్సీ వర్గీకరణ, కులగణనపై దృష్టి సారించలేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎస్సీ వర్గీకరణ, కులగణనపై చొరవ చూపడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గత సమగ్ర కుటంబ సర్వే ప్రకారం ఎస్సీ జనాభా 10 శాతం ఉండగా 11 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం తాజాగా నిర్వహించిన సర్వేలో మరో 2 శాతం పెరిగినట్లు తెలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు చల్లా మిథున్, మునిగాల అరుణ్, చినపెల్లి బాబు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయండి

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలును డిమాండ్ చేస్తూ ఈనెల 20న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడు రాచర్ల బాలరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు ప్రకటించడం తోపాటు రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణం కల్పిస్తామని, రైతుబంధు పెంపు, పింఛన్, తదితర అనేక హామీలు ఇచ్చినా అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరించిందని విమర్శించారు. ఎన్నికల హామీలేవీ అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని నమ్మించి కాంగ్రెస్ నాయకులతో వేసిన కమిటీ ఇళ్లు ఇస్తుందని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు బనాయించడాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. 20న ఉదయం 11 గంటలకు సుందరయ్య పార్కు నుంచి ఇందిరా పార్క్ వరకు ప్రజాప్రదర్శన ఉంటుందని తెలిపారు. అనంతరం ధర్నా చౌక్‌లో తలపెట్టిన బహిరంగ సభకు అన్ని వర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

సంగెం : మండల కేంద్రంలో నేడు (సోమవారం) గిరిజనుల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుక నిర్వహిస్తామని మాజీ జెడ్పీటీసీ గుగులోత్ వీరమ్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా భోగ్ భండారో, మహాఅన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

రైతు కిషన్‌రావుకు ఘన సన్మానం


కిషన్‌రావును సన్మానిస్తున్న అధికారులు

నడికూడ : మండలంలోని నర్సక్కపల్లి గ్రామానికి చెందిన వరికెల కిషన్‌రావును కిసాన్ దినోత్సవం సందర్భంగా ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో ప్రోగ్రాం హెడ్ ఇల్లందుల రవికుమార్, వరంగల్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, శాస్త్రవేత్త దిలీప్‌కుమార్, ఉద్యానవన శాఖ అధికారి రమేశ్ ఘనంగా సన్మానించారు. 20 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ వివిధ పంటలు సాగు చేసి అధిక దిగుబడి సాధిస్తున్నందుకు సన్మానించినట్లు తెలిపారు. ప్రతి రైతు కిషన్‌రావును ఆదర్శంగా తీసుకుని పంటసాగులో మెలుకువలు పాటించాలని సూచించారు.

ప్రజలపై అమ్మవార్ల అనుగ్రహం ఉండాలి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి


మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

ఆత్మకూరు : సమ్మక్క–సారలమ్మ అమ్మవార్ల అనుగ్రహం ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మను ఆదివారం ఆయన దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతర అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. భక్తులు పోటెత్తడంతో అగ్రంపహాడ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్, పర్వతగిరి రాజు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతవుతున్న అవెన్యూ ప్లాంటేషన్


కాలిపోతున్న చెట్లు

శాయంపేట : మండలంలోని మాందారిపేట శివారులో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల ప్రహరీ ఆవరణలో గల చెత్తను గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో అవెన్యూ ప్లాంటేషన్‌కు మంటలు అంటుకున్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా రోడ్డుకిరువైపులా నాటిన చెట్లు అగ్నికి ఆహుతి అవ్వడంతో పర్యావరణ ప్రేమికులు ఆగ్రహిస్తున్నారు. మాందారిపేట గ్రామ శివారు నుంచి గోవిందాపూర్ స్టేజీ వరకు తరచూ అవెన్యూ ప్లాంటేషన్‌లో చెట్లకు నిప్పంటిస్తుండడంతో అధికారులు ఇప్పటికీ చర్యలు చేపట్టకపోవడం గమనార్హమని మండిపడుతున్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ


విజేతలతో కరస్పాండెంట్, ప్రిన్సిపాల్


దామెర : గెలుపొందిన విద్యార్థులు

ఆత్మకూరు : శ్రీనివాస రామానుజన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో మండల కేంద్రంలోని సెయింట్ థెరిస్సా హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ లిస్ మేరీ తెలిపారు. 8వ తరగతి విద్యార్థిని చిట్టిబొమ్మల నిక్షిత స్టేట్ టాపర్‌గా, పదో తరగతి విద్యార్థి కేతిడి నితిన్‌రెడ్డి జిల్లా టాపర్‌గా నిలిచినట్లు పేర్కొన్నారు. అలాగే కీర్తన, ఉదయ్‌చంద్ర ,హర్షిత్‌రెడ్డి, అక్షర, అశ్వద్‌వర్మ ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రిన్సిపాల్ సిస్టర్ జాయిస్, వైస్ ప్రిన్సిపాల్ రోస్మి హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

దామెర : శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మాథ్స్ అండ్ సైన్స్ ఒలింపియాడ్‌లో మండలంలోని ఒగ్లాపూర్ డిస్నీల్యాండ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి 5,6 ర్యాంకులను సాధించారు. ఆదివారం హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఒలింపియాడ్ బహుమతుల ప్రదానోత్సవంలో పాఠశాలలో 8వ తరగతికి చెందిన ఎడ్డె సాయిశ్రీరామ్ 5వ ర్యాంకు సాధించగా, అదే తరగతికి చెందిన జాడి కేశవ 6వ ర్యాంకు సాధించగా, ముద్దురి శ్రీకాంత్, కోరే ప్రమోద్‌సాయి, అజ్మీర వినయ్, ఎండి.రెహాన్ జిల్లాస్థాయిలో నిలిచారు. అలాగే జిల్లాస్థాయి కన్సోలేషన్ బహుమతులు మధుశ్రీ, పెరుగు అరుష్, ప్రనోజ్, నితిన్, సుశాంత్, సాయి తేజ, బిందు, సాయిహర్ష, శ్రీనందన్‌రెడ్డి సాధించినట్లు పాఠశాల ముఖ్య సలహాదారుడు దయ్యాల మల్లయ్య తెలిపారు. సదయ్య, లక్ష్మీనివాసం, డైరెక్టర్లు శోభారాణి, రాకేష్‌భాను, దినేష్‌చందర్, మాథ్స్, సైన్స్ ఉపాధ్యాయులు అక్బర్, వెంకటేష్, నరేష్, శ్రీకాంత్, రామకృష్ణ, శ్రీలత పాల్గొన్నారు.

మొక్కలు నాటిన మాజీ ఎమ్మెల్యే


మొక్కులు నాటుతున్న ధర్మారెడ్డి

ఆత్మకూరు : బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ వ్యవస్థాపకుడు జోగినిపల్లి సంతోశ్‌కుమార్ పిలుపు మేరకు ఆదివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హనుమకొండలోని ఆయన నివాసంలో వృక్షార్చన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. అనంతరం చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ మానస పుత్రికైన హరితహారంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఆకుపచ్చ తెలంగాణగా మార్చినట్లు తెలిపారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ బోగస్ హామీలు నమ్మి మోసపోయామని ప్రజలు తెలుసుకున్నారని, కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవ్వాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారన్నారు. కేసీఆర్ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించాలని, సేవా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదుకు మరో అవకాశం

ఆత్మకూరు : సమగ్ర ఇంటింటి సర్వేలో వివరాలు నమోదు చేసుకోని వారు ఈనెల 28వ తేదీలోగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర ఇంటింటి సర్వేలో ఇప్పటివరకు నమోదు చేసుకోని వారు ప్రజా పాలన కేంద్రాల్లో సమాచారం అందించాలని, గతంలో తాళం వేసి ఉన్న ఇళ్లు, ఆసక్తి లేకపోవడం తదితర కారణాల వలన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల గణన ఇంటింటి సర్వే హౌస్‌లిస్టులో ఉండి సర్వే చేయని కుటుంబాలకు ఈనెల16 నుంచి 28వ తేదీ వరకు మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. టోల్–ఫ్రీ నంబర్ 040–21111111కు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య కాల్ చేసి సమాచారం అందజేయవచ్చునని, లేదా ఆన్‌లైన్ ద్వారా ఫారమ్ డౌన్‌లోడ్ చేసుకుని సంతకం చేసిన అనంతరం ఎంపీడీఓ ఆఫీస్‌లోని ప్రజా పాలన సేవా కేంద్రంలో సమర్పించవచ్చని ఆయన పేర్కొన్నారు.

పరకాలలో..

పరకాల : సమగ్ర కుటుంబ సర్వే చేపట్టిన సమయంలో అందుబాటులో లేని కుటుంబాలు ఆన్‌లైన్‌లో ఫామ్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కుటుంబ సభ్యుల వివరాలతోపాటు ఆధార్, ఇతర వివరాలతో ఫామ్‌ను కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 16వ తేదీ నుంచి ప్రారంభమైన సమగ్ర కుటుంబ సభ్యుల వివరాల స్వీకరణ 24వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎస్ఈఈఈపీసీఎస్‌యూఆర్‌వీఈవై.సీజీజీ.జీవీ.ఐఎన్ ద్వారా ఫామ్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.